# దీపపు వత్తి



"ప్రబుద్ధ"

"ఎవరితోనైనా పది నిముషాలు మాట్లాడితేచాలు ఆమనిషిని గురించిన కథ వ్రాసేస్తాను" అన్నాడట ఓ ప్రఖ్యాత రచయిత.

మా సునంద బహుశా ఆ రచయితకు అప్పగారో చెల్లెలో అయివుంటుంది.

అయితే ఎటొచ్చీ ఆ కథలు వ్రాయదు. నగిషీలూ, మెరుగులూ చెక్కి ఎంతో ఇంటరెస్టింగ్‌గా సస్పెన్సు పోగి శ్రవణానందకరంగా చెబుతుంది వన్నెచిన్నెలతో.

సామాన్యమైన మనిషి జీవించే జీవించవలసిన నార్మల్ పరిధికి ఏకొంచెం అటూ ఇటూ జరిగినా ఒక విచిత్రమైన కథగానే అనిపిస్తుంది దానికి.

ఏ జంట ప్రేమించి పెళ్ళి చేసికొని రెండేళ్ళు కాకుండా డైవోర్సు తీసికొన్నదో, ఏ కన్నెపిల్ల పెళ్ళి కాకుండానే తల్లి అయ్యే అర్హత సంపాదించుకొందో, ఏ యిల్లాలు భర్తను పక్లీకున రెండు తగలనిచ్చిందో ఇలాంటి కథలన్నీ తన దగ్గర ఉపక్రమోప సంహారాలతో చక్కగా కూర్చి ఉంటాయి. అసలు ఇలాంటి ఆశోపహతులను అదెన్నటికీ సహించలేదు. క్షమించనూలేదు.

పెదలు మెచ్చి తనకు నచ్చిన అఫీసరు కుర్రాడిని శాస్త్రోక్తంగా అంగరంగ వైభవంగా పెళ్ళి చేసికొని తారురోడ్డు మీది కారు ప్రయాణంలాగా కాలం గడిపే సునంద మరి ఇంకెలా ఉంటుంది? అత్తా మామా ఉన్నా ఎక్కడో 150 మైళ్ళదూరంలో ఉంటారు. ఏడాదికోసారి కొడుకు సంసారం చూడాలని వచ్చినా దొడ్లో పండిన కాయా కసురూ, వెన్నా నెయ్యి, పప్పులూ అప్పడాలూ అన్నీ మూటగట్టుకువచ్చి ఈ బస్తీ నీళ్ల సరిపడక పదిరోజుల్లోనే బండెక్కుతారు—పాతికోపరకో మనుమడి చేతిలో పెట్టి—ఇంక మా సునంద ఏ పెళ్ళికో పేరంటానికో పండగకో పబ్బానికో అత్తవారింటికి వెళ్ళినా, అబ్బురంగా చదువుకొని ఉద్యోగం వెలిగించే కోడలు వచ్చిందని అడుగులకు మడుగులొత్తుతారు. మరి శ్రీమంతం యింట ఆడబడుచాయె. ఇది ఆ ఉన్న వారం రోజులూ అత్తయ్యా మామయ్యా అని వగలు ఒలకబోసి అత్తగారికి అధ్యాత్మ రామాయణ కీర్తనలూ వినిపించి మామగారికి బస్తీ స్వీట్సు రకరకాలుగా చేసి పెట్టీ, ఇరుగూ పొరుగుకి చేతి సంచీలూ పూసల బుట్టలూ అల్లి చూపించీ, నౌకర్లకి ఓ పావలో పరకో, పాత చీరో కట్టబెట్టి ఎంత చదువుకొన్నా ఎంత కలుపుగోలుతనమున్నా అనిపించుకొని కొత్త చీరా సారే కట్టుకొని పిండివంటలతో బయలుదేరి మరీ వస్తుంది.

ఇంతకీ ....ఇది సునంద కథ అనుకునేరు. చక్కని యిల్లూ, తోటా, బంగారు తండ్రి లాంటి కొడుకూ, నౌకర్లూ. అప్రూపంగా చూసుకొనే మొగుడూ ఉన్న సునందకి కథేమి ఉంటుంది? అది చెప్పిన కథ. ఇదంతా – అంతే.

సునంద వరసకు మా మేనమామ కూతురు. నాకంటె నాలుగేళ్ళు ముందే లోకంలోకి వచ్చింది. అది ఆ సీనియారిటీ అన్నివిధాలా నిలుపుకోవటమే విశేషం. నాకంటె ముందు ఓణీలు వేసుకొంది. నాకంటె ముందు డిగ్రీ పుచ్చుకొంది. ఉద్యోగంలో చేరింది. పెళ్ళి చేసుకొని యేడాదిలో బాబు నెత్తుకొంది. ఎటొచ్చీ దానికి చదువుకోగానే ఉద్యోగం దొరికింది. నాకు ఓ ఏడాది గోళ్ళగిల్లుకుంటూ తపస్సు చేసిన తరువాత అది పనిచేస్తున్న ఊళ్లోనే ఆ కాలేజీలోనే ఉద్యోగం దొరకడం ఓ విచిత్రం. సునంద ఉన్నదిగదా అన్న ధైర్యంతోనే మా వాళ్ళు ఇంత దూరం పంపించారు. అదీ వాళ్ళాయనా వాళ్ళింట్లోనే ఉండమని ఎంతో బలవంతం చేసినా నాకది యిష్టంలేక ఓ చిన్న రూం తీసుకొని

స్థిరపడ్డాను. ఉద్యోగం కొత్త. ఒంటరిగా ఉండటం కొత్త — వంట చేసుకోవటం కొత్త, అన్నిటి కంటె ఈ కోతి మూకకు పాఠాలు చెప్పటం మరీ కొత్త. కావలసిన వన్నీ చూసుకోవటంతో, క్లాసులకు ప్రిపేరవటంతో, పరిసరాలకు అలవాటు అవటంతో సతమతం అవుతున్న నాకు మరింక దేని మీదా అంతగా దృష్టి లేకపోయింది.—

ఆ రోజు సాయంకాలం కాలేజినుండి వచ్చేటప్పటికి కొంచెం ఆలస్యం అయింది. తల కొదిగా దిమ్ముగా అనిపించింది. వేడి నీళ్ళతో మొహం కడుక్కొని కాస్త కాఫీ తాగి గదిముందు వసారాలో వాలుకుర్చీలో పడుకున్నాను కళ్ళు మూసికొని. వచ్చి నెల రోజులే అయినా ఏదో బెంగగా అనిపి


# అఖిల భారత పాప్యులారిటీ పోటీ

46 మొత్తముగల నమూనా. ఎంట్రీ ఫీజులేదు—మీరు బహుమతి గెలుపొందగలరు

| | | | |
|---|---|---|---|
| 10 | 15 | 8 | 13 |
| 19 | 4 | 17 | 6 |
| 12 | 11 | 14 | 9 |
| 5 | 16 | 7 | 18 |

మొదటి బహుమతి; ఒక వెస్పా స్కూటర్ లేక ఆల్విన్ రిఫ్రిజిరేటరు. లేక రు. 3000/ లకు విలువ కలిగిన 200 చ.గ. ప్లాటు

రెండవ బహుమతి ఒక టేపు రికార్డరు లేక ఆటోమాటిక్ కెమెరా. లేక రు. 1500/ విలువ కలిగిన 100 చ.గ. ప్లాటు.

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

మూడవ బహుమతి: 200 యాషికా జపాను మోడల్ పోర్టబుల్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టరు. వెల : రు. 270/-లో సగం ధర. ప్రతి కుటుంబమునకు బహుమతి.

మీరు చెయ్యవలసినది :

5 (అయిదు) నుంచి 20 (ఇరవై) వరకుగల అంకెలను పై ఖాళీ గడులలో నిలువుగా, అడ్డముగా, అయి మూలగా ఎటు కూడినా మొత్తం 50 (యాభై) వచ్చు నట్లు ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించి పూరించవలయును. ఒక కుటుంబం ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి.

ఆఖరి పోస్టింగ్ తేదీ : 22-6-74 ఫలితం తేది : 26-6-74

పోటీకి నిబంధనలు : (1) ప్రమోటర్ల తీర్మానము న్యాయమైనది మరియు కట్టుబడదగినది. ఈ పోటీ విషయంలో ఇది ఒక ముఖ్యమైన షరతు. (2) ఎంట్రీలయొక్క సక్రమమును అఫిషియల్ సీలు సొల్యూషన్‌తో పరిపోల్చి ఖచ్చితంగా చూడబడును. (3) మొదటి బహుమతి (1) అఫిషియల్ సొల్యూషన్‌తో సమానముగా వున్న దానికి ఇవ్వబడును. (4) రెండవ బహుమతి (1) మూడు అడ్డగడులు సమానంగా వున్న దానికి ఇవ్వబడును. (5) మూడవ బహుమతి : (200) మా అఫిషియల్ సొల్యూషన్‌తో ఏ వరుసతోనైనా, సంఖ్యతోనైనా సమానముగా వున్న దానికి ఇవ్వబడును. (6) గెలుపొందినవారు వరుస బహుమతులు పొందుటకు పోస్టేజి, ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించవలసిందిగా పోస్టు ద్వారా తెలియపర్చబడును. (7) ఫలితముల కొరకు 45 పైసల స్టాంపులు పంపాలి. (8) ఏ విజేతకు నగదు బహుమతి ఇవ్వబడదు. (9) కటింగ్ లేక నిబంధనల కాపీని భవిష్యత్తులో ఉపయోగార్థం ఉంచుకోండి. (10) ఈ పోటీకి ఎంట్రీఫీజు లేదు. అయితే మూడు నాలుగు షరతులకు లోబడి మూడు మరియు నాలుగు బహుమతులు ఇవ్వబడును.

**MAYUR AGENCY (AJW-50) ALIGARH-19**

స్తున్నది – ఇంతలో ఎవరో నా పేరు పెట్టి పిలిచినట్టు అనిపించింది.—

కళ్ళు తెరిచాను. తెలుగు లెక్చరరు సౌభాగ్యలక్ష్మి గారు ఎదురుగా నిలబడి ఉన్నారు. నాకు కొత్త ఆశ్చర్యం కలిగిన మాట నిజం. మహాసముద్రం అంత ఆ కాలేజీలో ఆమె సీనియరు మోస్టు లెక్చరరు. నేను సర్వీసులో చేరి నెలయినా కాని జూనియర్ మోస్టు జూనియర్ లెక్చరరుని. సామాన్యంగా ఆడవాళ్ళలో ఈ పదవులూ పట్టింపులు ఎక్కువని ఈ కొద్ది రోజుల అనుభవమే నేర్పింది నాకు– నేనామెను ఒక్కసారో రెండుసార్లో చూసి ఉంటాను. నేను కాలేజీలో చేరటానికి వచ్చినపుడు ప్రిన్సిపాలు ఊళ్ళో లేకపోవటంతో ఈమెకే జాయినింగ్ రిపోర్టు ఇచ్చాను. చాలా రిజర్వ్డుగా గంభీరంగా కనిపించిందామె. ఎక్కడో ఉన్న నా రూము వెతుక్కుంటూ ఆమె ఇలా రావటం నాకు కొంచెం వింతగానే అనిపించింది. దిగ్గునలేచి మర్యాదగా ఉన్న ఒక్క కుర్చీ ఆమెకిచ్చి నేను చాప వేసికొని కూర్చున్నాను. ఆమెకూడా కుర్చీ దిగి వచ్చి నా పక్కనే కూర్చున్నారు.

కొద్దిగా వయసుమళ్ళినా చక్కని ఆమె ముఖంలోని ప్రసన్నతా ప్రశాంతభావం నాకొక ఆరాధన లాంటిది కలిగించాయి. తెల్లని ఆకుపచ్చ నేత చీర. తెల్లని రవికె. అక్కడక్కడ నెరిసిన వంకీలు తిరిగిన పెద్ద జుట్టు జారుముడి వేసుకొంది. నుదుట ఎర్రని కుంకుమబొట్టు. ఇవన్నీ చూస్తుంటే అలనాటి స్వాతంత్ర్యోద్యమంలో పనిచేసిన అమ్మన్నరాజా, దుర్గాబాయి లాంటివారు గుర్తుకి వస్తున్నారు. ఎంతో స్తిమితంగా నా సంగతులన్నీ అడిగింది. ఊరు పేరూ. అమ్మానాన్న, ఇంతదూరం రావలసిన అవసరం అన్నీ తెలుసుకొంది— ఏవేవో సంగతులు చెప్పింది. మాట్లాడుతూనే ఎన్నో సుభాషితాలూ శ్లోకాలూ కోట్ చేసింది. నాకు సంస్కృతం రాదు. తెలుగు అంతబాగా వచ్చునని చెప్పలేను, అయినా మధురమైన కంఠంతో ఆమె అలా అనర్గళంగా చదువుతూంటే వినడానికి ఎంతోబాగుంది. ఆమె వయస్సులో సగం అయినా లేని నన్నామె మన్నిస్తూ ఎంతో ఆదరంగా మాట్లాడుతుంటే ఏదో గర్వం లాంటిది కలిగింది నాకు. దాదాపు ఒకగంట కూర్చుందేమో. తెలుగూ ఇంగ్లీషూ సంస్కృతమే కాకుండా మహారాష్ట్రం, తమిళం, కన్నడంకూడా ఆమె మాట్లాడగలరు. డబుల్ ఎమ్, ఏ. అపారమైన ఆమె విజ్ఞానానికి అత్తెసరు మార్కులతో అంతంత మాత్రంగా పాసైన నేనెంతో ఆశ్చర్యపడ్డాను.

చివరికి వెళతానంటూ లేచారామె. రెండు పండ్లు చేతికిచ్చాను. వెళ్ళబోతూ కొంచెం ఆగి.... "మిస్ సావిత్రి... మీ దగ్గరకు చిన్న పనిమీద వచ్చానసలు. మీరేమి అనుకోనంటే ఓ చిన్న హెల్పు కావాలి. ఒక యాభై రూపాయిలుంటే సర్దగలరా" అని అడిగింది.

వినగానే నా మనసు కొంచెం కలుక్కుమన్నా మళ్ళీ సర్దుకొన్నాను. పెద్దపెద్ద వాళ్ళే డబ్బుకు అప్పుడప్పుడు ఇబ్బంది పడుతుంటారని నాకు తెలుసు, ఇంతెందుకు? బంగారు పిచ్చిక లాంటి మా సునందే రెండు సార్లు నా దగ్గర పదేసి రూపాయలు తీసుకొంది.

"తప్పకుండా మేడమ్" అని లోపలికి వెళ్ళి తెచ్చి యిచ్చాను. ఆమె థ్యాంక్సు చెప్పి వెళ్ళిపోయింది. చాలా సేపటి వరకూ ఆమే జ్ఞాపకం వచ్చింది – ఎందుకామె పెళ్ళిచేసుకో లేదు? పచ్చని పసుపుకొమ్ము లాంటి ఆమె శరీరచ్ఛాయ, ఎర్రని ఆ పెదవులూ. తేజస్సు వెదజల్లే ఆ నల్లని పెద్ద కళ్లూ, చిన్నగా తీయగా పల్కే ఆ గొంతూ – ఇవే ఎంతోసేపు నన్ను వేటాడాయి.

ఆమె వచ్చిన సంగతీ– నా దగ్గర డబ్బు తీసికొన్న సంగతి నేనెవరితోనూ అనలేదు

ఈ హెడ్సుకీవాళ్ళలో వాళ్ళకెన్నో గొడవలుంటాయి. ఎందుకు పనికట్టుకొని చెప్పటం అని నేనెవరితోనూ అనలేదు.

వారం పని రోజులయిందేమో.... ఏదో సెలవురోజు. సునందగారింటికి వెళ్ళాను. వాళ్ళాయన ఊళ్ళోలేడు. బాబుతో చాలా సేపు ఆడుకొని, అక్కడే భోజనంచేసి పడుకొని సాయంకాలం నా రూముకి బయలుదేరాను- నన్ను బస్సెక్కించటానికి వచ్చింది సునంద. రెండు ఫర్లాంగుల తర్వాతగాని బస్సుస్టాపు లేదు. ఇద్దరం ఏదో కబుర్లు చెప్పుకొంటూ నడుస్తున్నాం— అయిదారిళ్ళు దాటగానే ఎవరో పెద్దగా అరుస్తున్నట్లు వినిపించింది. "ఎందమ్మా! మళ్ళీ పెదమడుసులు. ఉద్యోగం చేస్తున్నామని గొప్పలు చెప్పుకొంటూ ఉంటారు. ఎన్నాళ్ళాయె! ఇదిగో రేపిత్తా మాపిత్తానని తిప్పుకోటమే గాని పదిరూపాయలన్నా చెల్లగట్టక పోతిరి.... నేనెటా బతకాలె" ఇలాంటి ధోరణిలో సాగుతోంది.

యధాలాపంగా తలెత్తాము లోపల వరండాలో స్తంభంచాటున ఉన్నా గుర్తుపటాను. సునంద ఏమీ మాట్లాడకుండా విసురుకొంటూ నా చేయిపట్టుకొని లాక్కుపోయింది.

సునందా! ఆమె తెలుగు లెక్చరరు సౌభాగ్యలక్ష్మిగారు కదూ?

ఉఁ

మరి ఏమిటాగోల?

"ఏముందీ! అప్పుచేసి పప్పుకూడు. నలుగురిచేతా మాటలు పడటం. ఎప్పుడూ ఉండే భాగవతమే ..అయ్యా లింగాలకూ అమ్మా జంగాలకూ" అదిగో నీ బస్సు వచ్చేస్తోంది....ఎక్కు. సునంద మాటలకీ పొడుపు కథలకూ ఆట్టే తేడాలేదు.

సందేహం తీరకుండానే బస్సులో కూర్చున్నాను.

మర్నాడు కిటికీ దగ్గరగా మార్చుని కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుకొంటున్నాను, దూరంగా కాలేజీ ఫౌంటెన్ గట్టు పక్కన ఎవరో ఘర్షణపడుతున్నారు.

తేరిపార చూశాను. మళ్ళీ అదే సీను. సౌభాగ్యలక్ష్మిగారు, ఎవరో బట్టతలాయన. ఇంకో ఇద్దరు లెక్చరర్లు సర్దిచెప్పాలని ప్రయత్నిస్తున్నట్టున్నారు.

నాకు ఇంక అలా కూర్చోవాలనిపించలేదు. లేచి ఏం చెయ్యాలో తోచనూ లేదు. సుడిగాలిలా వచ్చింది సునంద -

"బాబుకు రాత్రి నుంచీ టెంపరేచరు సావిత్రీ...ఉన్నట్టుండి రాత్రి వచ్చింది" ఏం తోచటంలేదు ఆయనకూడా ఊళ్లోలేరు."

మరి సెలవు పెట్టకపోయావా?

"ఏం చెయ్యను! సెలవులన్నీ అయిపోయాయి- పర్మిషన్ తీసుకొని తొందరగా వెళ్ళిపోవాలనుకుంటున్నాను. సాయంకాలం శ్రమ అనుకోక ఓసారి రద్దూ...మనిషికి మనిషి తోడుంటే నాకు కాస్త ధైర్యంగా ఉంటుంది ఆయన రాత్రికి వస్తారనుకుంటున్నా"

"అలాగే వస్తాను దానిదేముందిగానీ, సునందా అలా చూడు - ఆ ఫౌంటెనుదగ్గర. అదేదీ పెద్ద విషయం కానట్టుగా చూపి నిట్టూర్పు విడిచింది సునంద. అంటే ఇంత కథ మొదలుపెడుతుందన్నమాట.

ఆవిడేదో ఇబ్బందుల్లో ఉన్నట్టున్నారు సునందా. అసలేంటీ కథ?"


దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము



హస్తప్రయోగం, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టమువపుంసకత్వము, హెర్నియా, కుష్ఠు, బొల్లి, చర్మవ్యాధులు, పోస్టుద్వారా కూడా చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల, డా॥ దేవర.
టి. బి. రోడ్, ఫోన్ : 551 తెనాలి.
బ్రాంచి 9-D, శివాజీస్ట్రీట్, మద్రాస్-17


SUVARNA

తెలీటంలేదూ. ఆయన ఇంటి ఓనరు. ఏకంగా కాలేజీకి వచ్చేశాడు. ఏ అయిదారు నెలల అద్దె అయినా బాకీ ఉండి ఉంటుంది. ఊరుకొంటారేమిటి మరీ?

“పోనీ సునందా! అందరం అలా చూస్తూ ఊరుకోవటం ఏం బాగుంటుందీ నలుగురం కలిసి ఏదయినా సర్దుబాటు చేస్తే.”

నా మాట పూర్తిగానీయలేదు సునంద! “అమ్మాయి నీ దగ్గర డబ్బెక్కువవుంటే ఇలా పడెయ్యి. అసలే చాలా అవసరంగా ఉంది. అంతేగాని ఎందుకు సముద్రంలో పారబోసినట్లు పాడుచేసుకొంటావు? అసలు అయినా ఈపాటికి నీవావిడ కళ్ళల్లో పడే ఉండాలే.... పరిచయస్తులూ కాని వాళ్లూ అనే తేడా ఏం లేదావిడకు....”

“అంత అన్యాయంగా మాట్లాడను సునందా...అందరం మనుష్యులమే. అవసరాలు అనేవి అందరికీ ఉంటాయి.”

నిటారుగా నిలబడి నిశితంగా చూసింది సునంద. “ఆహా! ఏం జాలిగుండె. అందరం మనుష్యులమే ఎంత గొప్ప విషయం సెలవిచ్చారండీ...అందరికీ ఇబ్బందులు అంటూ వస్తాయి నిజమే ఎప్పుడో. ఎప్పుడూ వచ్చే ఇబ్బందుల నెవరు తీర్చగలరు?

లైబ్రరీ వెనుక వరండాలో కుర్చీలో కూర్చుని సునంద ఆమె చరిత్రఅంతా ఏకరువుపెట్టింది.

“అదీకథ సావిత్రి. బోలెడంత చదువుకుంది అంటారు అందరూ. ఎందుకొచ్చిన చదువులెద్దూ బ్రతకటం నేర్చుకోలేకపోయిన తరువాత ఈమె తండ్రిగారు ఓ ఛోటా జమిందారు దగ్గర దివానుట. అఫ్‌కోర్స్ మాజీ అని ముందు చేర్చుకో. ఆయన దర్జాలకూ, విలాసాలకూ, అందుకు తగినట్లు ఒకళ్ళ తరువాత ఒకళ్లు ఇద్దరు ముగ్గురు భార్యలూ, తద్వారా సంక్రమించి సంతానమూ అంతా ఓ వెలుగు వెలిగారుట ఎప్పుడో. ఇప్పుడా సంస్థానమూ లేదు. ఆ దివాన్‌గిరీ లేదనుకో.

“ఏదో నయంకాని రోగంతో ప్రస్తుతం మంచాన్ని మాత్రం ఏకచ్ఛత్రంగా ఏలుతున్నాడు. ఈమె సవతి సోదరులు మహా ఘనులు. ఒకడేదో బ్రాకెట్లో ఏవో ఆడి కొంపమీదికి అప్పులు తెస్తూ ఉంటాడు. రెండోవాడు చేతికందింది సంగ్రహించి దేశాటనంచేసి తిరిగివస్తూ ఉంటాడు. చెల్లెళ్ళిద్దరూ మన కాలేజీలోనే చదువుతున్నారు నీవు చూడలేదేమో. ఫాషన్ పెరేడుకి వచ్చినట్టు వస్తూ ఉంటారు”... ఇప్పుడు చెప్పుతల్లీ ఉన్నట్టుండి గొంతు తగ్గించింది సునంద....మన కర్తవ్యం ఏమిటి.”

సునంద చెప్పే కథలు వినటం నాకే కొత్తకాదు కానీ నాకేదో నిస్పృహ అనిపించింది. ఆమెకు నేను డబ్బిచ్చానని చెప్పి సునందచేత ఆటలు పట్టించుకోవటం ఇష్టం లేకపోయింది చికాకుగా లేచాను.

మర్నాడు సాయంకాలం వంట చేసుకొంటున్నాను. ఎవరో తలుపు తట్టారు. తీసిచూస్తే సౌభాగ్యలక్ష్మిగారు. ఇదివరకంత ప్రసన్నంగా పలుకరించగలిగానా? నాకు నేనే సమాధానం చెప్పుకోలేకపోయాను. మనిషి మనసుకి ఎన్ని తెరలు ఎన్ని పొరలు! క్రిందటిసారీ ఈసారీ మనుష్యులం ఆ ఇద్దరమే. అయినా ఏదో తెర వేలాడుతోంది.

మర్యాదకు రమ్మని ఆహ్వానించాను. ఆమె ముఖంలో ఏమీ మార్పులేదు. అలాగే సౌజన్యంగా చిరునవ్వుతో శాంతంగా వున్నది.

నాకు ఏమిటో అశాంతిలాంటిది బయలుదేరుతోంది. మొన్ననే నేను మొదటిసారి జీతం తీసుకొన్నాను. అది ఆమెకు తెలిసే ఉంటుంది. ఎన్నాళ్ళబట్టో నీలం రంగు గద్వాలు చీర కొనుక్కోవాలని సరదా పడుతున్నాను.

నాన్నగారికి నిన్ననే పంద రూపాయలు పంపాను గొప్పగా. అమ్మా, నాన్నావద్దనే వ్రాశారు. అవసరానికుంచుకోమనే వ్రాశారు.